క్లుప్తంగా

పేదల సంక్షేమమే ధ్యేయం

మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందిస్తున్న నాయకులు

దుద్యాల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన 30 నూతన రేషన్ కార్డుల, 19 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలకు సంబంధించిన ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులు గానీ, ఇందిరమ్మ ఇళ్లు గానీ మంజూరు చేయలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, చాకలి శ్రీనివాస్, సాయిలు, పాల్గొన్నారు.

పసుపు సాగు రైతులు దరఖాస్తులు చేసుకోవాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్

మోమిన్‌పేట: పసుపు సాగు రైతులు ప్రభుత్వం అందజేసేఆర్థిక సాయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పసుపు పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలనే లక్ష్యంతో ప్రోత్సాహం అందజేస్తుందని తెలిపారు. 15సంవత్సరాల క్రితం సాగు నీటి వసతి కలిగిన ప్రతీ రైతు పసుపు సాగు చేసేవారని పేర్కొన్నారు. కాని రాను రాను మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక, సమయానికి కూలీలు దొరకక పెట్టుబడి ఖర్చులు పెరగడంతో సాగు విస్తీర్ణాన్ని తగ్గించారని ఆయన తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.10వేలకు పైగా ధర లభించడంతో సాగు విస్తీర్ణం పెంచారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచేందుకు ప్రోత్సాహకంగా ఎకరాకు రూ.16వేలను సాయం చేస్తుందన్నారు. ఈ నెల 11వ తేదీన మోమిన్‌పేటలోని రైతు వేదికలో ఉద్యానశాఖాధికారి అక్షితరెడ్డి అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు.

చురుగ్గా జాతీయ రహదారి విస్తరణ పనులు

యాలాల: మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ కూడలిపై చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు రోజులుగా లక్ష్మీనారాయణపూర్‌లోని టీ డబ్బాలు, బెకరీలు, హోటళ్లు ఇతర వ్యాపార సముదాయాలను తీయిస్తున్నారు. శుక్రవారం నుంచి అడ్డుగా ఉన్న భారీ చెట్లను తొలగిస్తున్నారు. దీంతో లక్ష్మీనారాయణపూర్ మీదుగా కొడంగల్, యాలాల, బషీరాబాద్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ అంతరాయ ం ఏర్పడింది. ప్రధాన కూడలిలో చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే వారు జాతీయ రహదారి విస్తరణ పనులతో ఆందోళన వ్యక్తం చేశారు.

టీబీతో ఆందోళన వద్దు

జినుగుర్తి పీహెచ్‌సీ డాక్టర్ రశీద్



కోటబాసుపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రశీద్

తాండూరు రూరల్: టీబీతో ఆందోళన చెందొద్దని జినుగుర్తి పీహెచ్‌సీ డాక్టర్ రశీద్ పేర్కొన్నారు. శుక్రవారం జినుగుర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కోటబాసుపల్లిలో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 రోజులకు పైగా దగ్గు, జ్వరం, ఆయాసం, చాతినొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ వినోద్‌కుమార్, ఏఎన్ఎం భారతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకొని శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో పేదలకు సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతిరెడ్డి మరెన్నో ఉన్నత పదవులు సాధిస్తూ ప్రజలకు సేవలందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఊరికి దూరం..

- రైతువేదికలు అధ్వానం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు



ఊరికి దూరంగా బిచ్చాల రైతువేదిక

దౌల్తాబాద్: రైతు వేదికలు దూరంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిచ్చాల రైతు వేదిక కూడా దూరంగా ఏర్పాటు చేయడంతో అక్కడ నిర్వహించే ఆయా కార్యక్రమాలకు హాజరు కాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారు పంట సాగులోని మెలకువలు, సూచనలు, ఉపయోగాలు తెలుసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీనిని ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. ఇక్కడికి మహిళా రైతులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు రాలేక పోతున్నారు. రైతులకు ఉపయోగపడవలసిన వేదికలు నిరుపయోగంగా తయారవుతున్నాయని చెబుతున్నారు.

దౌల్తాబాద్ రైతువేదిక అదే పరిస్థితి

అన్నదాతలకు పంటల సాగులో మెలకువలు, ఉపయోగాలు నేర్పించి కొత్త వంగడాలు పరిచయం చేసేందుకు వివిధ పథకాల సమాచారాన్ని అందించేందుకు గత ప్రభుత్వం వీటిని నిర్మించింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో రెండు, మూడు కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం మూడేళ్లుగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ భారంగా మారిందని వ్యవసాయ ఏఈఓలు పేర్కొంటున్నారు.

5వేల మందికి క్లస్టర్‌గా..

మండలంలో నాలుగైదు గ్రామాల్లోని 5వేల మంది రైతులకు ఓ క్లస్టర్ చొప్పున 9 రైతు వేదికలు మంజూరు చేసింది. నెలలో రైతులతో రెండు సమావేశాలు నిర్వహించడం, పంటల నమోదు వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. రైతు బీమా వివరాలు క్లస్టర్ల వారీగా నమోదు చేసేవారు. నిర్వహణ నిధులు నిలిపి వేయడంతో ఏఈఓలు మూడేళ్లుగా నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల రైతువేదికల్లో భూ భారతి చట్టంపై అవగహన సదస్సులు నిర్వహించారు. వీటి నిర్వహణ వ్యయాన్ని ఏఈఓలే భరించినట్లుగా తెలుస్తుంది. మండలంలో రైతువేదికల నిర్వహణ నిధులు రూ. లక్షల్లో బకాయి ఉన్నట్లు ఏఈఓలు పేర్కొంటున్నారు.

> **శుభ్రం చేయిస్తున్నాం**
>
> ప్రభుత్వం రైతులకు ప్రత్యేకంగా నిధులంటూ ఇవ్వడంలేదు. రైతు వేదికలను ఏఈఓలు శుభ్రం చేయిస్తున్నారు. అప్పట్లో స్థలాలు లేక గ్రామాలకు దూరంగా నిర్మించారు. ఏదైనా అవసరముంటే ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటున్నారు.
>
> – లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

ఇసుక తరలిస్తే ఒప్పుకోం

విశ్వనాథ్‌పూర్ గ్రామస్తుల హెచ్చరిక



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న విశ్వనాథ్‌పూర్ గ్రామస్తులు

యాలాల: కాకరవేణి నది నుంచి ఇసుక తరలిస్తే ఒప్పుకోమని విశ్వనాథ్‌పూర్ గ్రామస్తులు హెచ్చరించారు. ప్రభుత్వ పనులైనా సరే, ఇసుక తరలింపు ప్రక్రియ తమ పరిధిలో చేపట్టేందుకు వీలు లేదని వారు పట్టుబట్టారు. గురువారం ప్రభుత్వ పనుల కోసం కాకరవేణి నదినుంచి ఇసుక తరలించే నిమిత్తం అనుమతితో వచ్చిన ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. నది ప్రాంతం వద్ద దాదాపు మూడు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. కొడంగల్‌తో పాటు దుద్యాల, బొంరాస్‌పేట మండలాల్లో కొత్తగా చేపడుతున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు రెవెన్యూ శాఖ అధికారులు అనుమతులిచ్చారు. దాదాపు 10 రోజుల పాటు 15 ట్రాక్టర్లతో నది ఒడ్డుకు డంప్ చేసిన అనంతరం టిప్పర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇచ్చారు. అయితే తమ గ్రామ పరిధిలో కాకరవేణి నది సమీపంలోని పొలాల్లో ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు తమ బాధను అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. ఇసుక తరలింపు విషయమై అనుమతి ఇవ్వొదని పేర్కొంటూ ఇటీవల కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్లకు వినతి పత్రం అందించామన్నారు.

ఊపందుకొన్న ఇందిరమ్మ ఇళ్లు



ఎన్కేపల్లిలో నిర్మిస్తున్న ఇళ్లు

- మెటీరియల్ ధరలు పెరగడంతో ఆందోళన
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులు
- పట్టించుకోని అధికారులు

మోమిన్‌పేట: ఇళ్లులేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ఊపందుకోవడంతో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పేదలకు 390 ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేశారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్‌లను కూడా అందజేశారు. 400చదరపు అడుగులకు తగ్గకుండా 600చదరపు అడుగులకు మించకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టుకోవాలని అధికార యంత్రాంగం నిబంధనలు విధించింది. ఇప్పటికే 190 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 15మంది బెస్‌మెంట్ పూర్తి చేసుకోగా 10మంది లబ్ధిదారులకు సంబంధిత బిల్లులను వారి ఖాతాలో జమచేసినట్లు హౌసింగ్ ఏఈ రమేశ్ పేర్కొన్నారు. రోజురోజుకు నిర్మాణ పురోగతి పెరుగుతుందని ఆయన వివరించారు.

పెరిగిన ధరలతో ఇబ్బందులు..

ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక, ఇనుము, కంకర ధరలు అమాంతం పెరిగాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మించే సెంట్రింగ్ మేస్త్రీల కొరత కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. రూ.120లకు ఫీటు చేసే మేస్త్రీలు రూ.150లకు పెంచేశారు. రెండు నెలల క్రితం ఇసుక టన్నుకు రూ.1,800ల నుంచి రూ.2,000 వరకు ఉండగా ప్రస్తుతం రూ.2,400ల నుంచి రూ.2,600ల వరకు లభిస్తుందని పేర్కొంటున్నారు. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టడంతో కూలీలు కూడా దొరకడం లేదంటున్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్స్, మేస్త్రీల ధరలు పెరగడం, కూలీలు కూడా సమయానికి దొరకకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవని అప్పులు తెచ్చి నిర్మాణ పనులు చేయాల్సిందేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి



తంగడపల్లిలో ఇంటింటి ప్రచారంలో నాయకులు

చేవెళ్ల: బీజేపీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి, మడికట్టు గ్రామాల్లో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ అందించే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పాలన చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూడా ఒకసారి బీజేపీకి అవకాశం కల్పిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌గౌడ్, రామస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, మాధవరెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, వెంకట్‌రెడ్డి, మానిక్యరెడ్డి, ఈశ్వర్, సిద్ధార్థ, మహేందర్‌రెడ్డి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తుంది'

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బీ సీలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రతిఒక్కరూ గుర్తిస్తున్నారని బీజేపీ ఓబీసీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ఎలిగని వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇవ్వాలన్నారు. మతపరమైన పది శాతం ముస్లింలకు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వంలో ఎంత మంది బీసీ మంత్రులు ఉన్నారని ప్రశ్నించారు. బీసీలను మోసం చేయాలనే ఆలోచనతో ముస్లింలకు మతపరమైన 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఏంటని విమర్శించారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు

నందిగామ: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్‌పార్టీ ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆరోపించారు. నర్సప్పగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ సర్పంచ్ గోవిందు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్‌లోకి చేరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకే నమ్మకం లేకుండా పోయిందని, దీంతో స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారన్నారు.

అంబాభవానీ మాతకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బషీరాబాద్: దామర్‌చెడ్‌లోని భవానీ నగర్‌లో వెలసిన అంబాభవానీ మాతకు శుక్రవారం వరలక్ష్మీవ్రతం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి ధర్మజాగరణ చేశారు. అమ్మవారి దర్శనం కోసం తాండూరు నియోజకవర్గంలోని భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మహిళలు చీర, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రక్షాబంధన్ పురస్కరించుకొని ఆలయ పీఠాధిపతి, తెలంగాణ సాధూపరిషత్ అధ్యక్షుడు శ్రీశంకర్ స్వామీజీ రాఖీలు కట్టారు. అలాగే భక్తులకు ప్రవచనాలు చెప్పారు. నిజామాబాద్ నుంచి సాధువు శ్రీనరేంద్ర ఆర్య, మహబూబ్‌నగర్ నుంచి రఘుపతి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



మాట్లాడుతున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే రత్నం

నవాబుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని మండలంలో మరింత పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ కోకన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జగన్, దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, మండల అధ్యక్షుడు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రావు నాయకులు నరేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రత్నం, పద్మారావు, నర్సింలు, శేఖర్ రెడ్డి, మధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంచొచ్చని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పేర్కొన్నారు. పురపాలక సంఘం వందరోజుల కార్యచరణలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎర్రగడ్డపల్లిలో ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు వేరుగా చేసి ఇంటివద్దకు వచ్చే సిబ్బందికి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న రామచంద్రారెడ్డి

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని గుండాలలో గ్రామానికి చెందిన సువర్ణ కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ విషయం గురించి పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ.18 వేల చెక్కును మంజూరు చేయించారు. ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేదలను ఆదుకోవడంలో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో దస్తయ్య, శ్రీను, అంజిలయ్య, మల్లేశ్‌గౌడ్, కాశప్ప, శ్రీను, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మట్టి తొలగింపు



జేసీబీతో మట్టిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజామోహియుద్దీన్ అన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి హిమాయత్‌నగర్ పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ చౌరస్తాలలో భారీగా వర్షం నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో శుక్రవారం ఉదయం మున్సిపల్ సిబ్బందితో పాటు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశంతో కలిసి హిమాయత్‌నగర్ చౌరస్తాలోని పలు హోటల్స్ ముందు నాలాలకు నీరు వెళ్లే విధంగా జేసీబీతో మట్టిని తీయించారు. భవిష్యత్‌లో రోడ్డుపై మట్టి పోస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సంధ్యారాణి, వెంకటేశ్వర్ రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయన్న ఆశయ సాధనకు కృషి



దుద్యాల్: పండుగ సాయన్న జయంతిలో మండల నాయకులు



ధారూరు: నివాళులర్పిస్తున్న నాయకులు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో నివాళి

దుద్యాల్: పండుగ సాయన్న ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు ముదిరాజ్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు మాట్లాడుతూ.. పండుగల సాయన్న గొప్ప మానవత వాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మడిగ శ్రీనివాస్, జయరాములు, బసప్ప, కేశవులు, రాము, మేరుగు సంజీవ్, లాలప్ప, శ్రీనివాస్, ప్రభు, సత్యనారాయణ, సాయిలు, ప్రకాశ్, మొగులప్ప, రాములు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటయ్య, తిరుపతయ్య, లింగనపల్లి అశోక్, ఎల్.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

దోమ: పీఎంయూపీ లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఉచిత సబ్సిడీ సిలిండర్ల కోసం సకాలంలో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయానికి వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఇళ్లను శుభ్రం చేసుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఇళ్లల్లో మహిళలు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఒకరినొకరు పసుపుబొట్టు ఇచ్చుకున్నారు.



అనంతగిరి: సరస్వతీ శిశు మందిరంలో అమ్మవారి వేషధారణలో చిన్నారులు



తాండూరు: వరలక్ష్మి వ్రత పూజలో పట్నం మహేందర్‌రెడ్డి, నాయకులు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



దుద్యాల్: వరలక్ష్మి పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు తీసుకుంటున్న విద్యార్థులు